•

# ఏంత ఘటన!

"అమ్మగోరూ! అమ్మగోరండీ! ఆ మిల్లీవోడి దాక్షికం యిన్నారా! సార్జీలు పెంచీసినాడు. కేజీకి రూపాయి ఎగస్ట్రా ఏసీసినాడు! అదేటంటే నానేటి సేయను కరెంట్ సార్జీలు పెరిగినాయి తెల్దేటి? రెండు కేజీలకీ అదనంగా మరిరెండు రూపాయలొట్టు గొత్తేనే పిండాడతన్నాడండి!" అంది కొండమ్మ.

"సర్లే! యింద రెండు రూపాయలు. తీసుకొని వెళ్లి త్వరగా మర పట్టించుకొనిరా! అవతల బోల్డు పనులున్నాయి" అంది వినీల.

"సిటంలో పారొత్తానండి!" అంటూ వెళ్లింది కొండమ్మ.

వినీల వెనుదిరిగి కిచెన్ వేపు వెళ్లబోయేసరికి-

"అమ్మగోరూ పాలండి!" అన్న పాలవాడి కేక విని పాలగిన్నె తీసుకొని వీధిగుమ్మంలోకి వచ్చింది.

పాలవాడు రెండు పూటలా గేదెను ఇంటి ముందుకు తోలుకొని వచ్చి పాలు పితికి పోస్తాడు. వాడు గేదె వద్ద కూర్చొని పాల చెంబు గాల్లో తల క్రిందులుగా త్రిప్పి చూపించి పాలుపితికి తెచ్చేడు.

"అమ్మగోరూ! యీనెల కాడ్నుంచీ నీటరుకి రూపాయి ఎగస్ట్రా అవుద్దండి!' ' అన్నాడు పాలు కొలిచి గిన్నెలో పోస్తూ.

"అదేమిటోయ్! సడెన్‌గా ఒకేమారు రూపాయి పెంచేసేవు..."

"నానేటి పెంచీనేదండీ! ఆ మిల్లీవోడు, సావుకారు పసువుల దానాలు, తవుడు, సిట్టూ, పొట్టూ, నూకలు దరలు పెంచేసి నారండి! అదేటని మావు నిలదీస్తే మా వేటి



సేసేది? కరెంట్ సార్జీలు పెరిగినాయికదా! ఎరికనేదేటి? అంతన్నారండీ! అమ్మగారూ నాను రూపాయే యేసినాను గాని డెయిరీవోల్లు పేకెట్టుకి రూపాయి ఏస్తారు సూడండీ! అయిను పెట్టెల్ల ఎట్టేవిగడండీ!'' అన్నాడు ఎంతో ఉదారత ప్రకటిస్తున్నట్లు.

వినీల పాలవాడితో ఏమాత్రం ఆర్గ్యూ చెయ్యతల్చుకోలేదు.

''వాడు ఎన్నో సంవత్సరాలుగా నమ్మకంగా యింటికి గేదెను తోలుకొని వచ్చి పాలుపిండి పోస్తున్నాడు. వానొచ్చినా వరదొచ్చినా ఎన్నడూ నాగాపెట్టడు. తను వద్దంటే చాలు అతడి వద్ద వాడిక పెట్టుకుందికి ఎంతో మంది ఎదురు చూస్తున్నారు'' అనుకుంది.

ఉదయం రెండు లీటర్లూ, సాయంత్రం లీటరు రోజుకి మూడు లీటర్లపాలు తీసుకుంటోంది వినీల.

"సర్లేగానీ!" అంది. నెలకు పాలకే అదనంగా తొంభై రూపాయలు చెల్లించాలి అన్న భావన ఆమె గుండెలో రాయి పడినట్లైంది.

"పోనీ పాలు తగ్గిద్దామంటే అసలు సరిపోవు. అందరికీ రెండు పూటలా చిక్కటి పెరుగుండాలి" అనుకుంది.

"మమ్మీ! నా పోకెట్ మనీ యీ నెల నుండీ మరో యాభై రూపాయలు పెంచాలి! మాకేంటీన్లో రేట్స్ పెంచేరు. కరెంట్ ఛార్జీలు పెరిగేయని" అన్నాడు వినీల పెద్దకొడుకు విజయ్.

"కరెంట్ ఛార్జీలకూ మీ కేంటీన్ రేట్స్‌కి సంబంధమేమిట్రా!" అంది ఆశ్చర్యపోతూ.

"ఏమిటి మమ్మీ! ఏం తెలియనట్లు అడుగుతున్నావ్! కేంటీన్లో కిచెన్ పరికరాలు పప్పురుబ్బడానికి గ్రైండర్ వగైరా అన్నీ కరెంట్ వల్లే కదా పనిచేస్తాయి!"

"అయితే రేపట్నించి నీకూ టిఫెన్ బాక్సలో పెట్టి యిస్తాను"

"ఏమిటి మమ్మీ! టిఫెన్ బాక్స్ తీసుకొని క్లాస్‌కి వెళ్తే మా ఫ్రెండ్సంతా నవ్వుతారు" అన్నాడు విజయ్ ఉక్రోషంతో.

"ఎందుకు నవ్వుతార్రురా? మీ డాడీ, తమ్ముడు, చెల్లెళ్లూ తీసుకొని వెళ్తున్నారుగా."

"డాడీ సంగతి వేరుమమ్మీ! వాళ్ల ఆఫీసులో అందరూ టిఫెన్ బాక్స్‌లు తెచ్చుకుంటారు. పైగా డాడీ ఆఫీసుకి స్కూటర్‌మీద వెళ్తారు. నేను బస్సు రద్దీలో కాలేజీకి వెళ్లాలి. ఇక తమ్ముడు, చెల్లాయిల స్కూల్స్ చాలా దగ్గర"

"మరేం ఫర్వాలేదు! నువ్వూ ఓ బేగ్ కొనుక్కొని అందులో అన్నీ వేసుకొని వెళ్లు! బస్సులో యీజీగా వుంటుంది."

"కాన్వెంట్ పిల్లల్లా కాలేజీకి భుజాన్న బేగ్ తగిలించుకుని వెళ్తారేంటి? ఆఫ్టరాల్ ఫిఫ్టీరూపీస్ కోసం అంతలా ఆర్గ్యూ చేస్తున్నావ్! పోనీలే నాకసలు పోకెట్ మనీయే అవసరం లేదు!" అంటూ విసురుగా బుక్స్ తీసుకొని వెళ్లిపోయేడు విజయ్.

కొడుకు వెళ్లిన వేపు చూసి నిట్టూర్పు విడిచింది వినీల.

"మమ్మీ! నా కంప్యూటర్ ట్యూషన్ వంద రూపాయలు పెంచేరు యీ మంత్ నుంచీ. కరెంట్ ఛార్జీలు పెరిగేయి కదా!" అన్నాడు సుధీర్ విమల రెండో కొడుకు.

"వంద రూపాయిలే!" అంది ఆశ్చర్యపోతూ.

"అవును మమ్మీ! ఏ.సీకి కరెంట్ ఎంతవుందో తెలుసా!కంప్యూటర్స్ ఏసీ లేందే పనిచెయ్యవు. కంప్యూటర్స్ కూడా కరెంట్‌తోనే పనిచేస్తాయి!" అన్నాడు.

వినీల ఆలోచనలో పడింది.

"నిజమే! యాంత్రికయుగం ఇది. ఈ రోజుల్లో అన్నిపనులు కరెంట్‌పైనే ఆధారపడ్డాయి. కరెంట్ లేకుంటే ఏపనీ జరగదు. జనులు సుఖాలకు అలవాటు పడ్డారు" అనుకుంది.

వినీల కిచెన్‌లో కరెంట్‌తో పనిచేసే పరికరాలు చాలా వున్నాయి. అవిగాక ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, గీజర్, ఐరన్, టీవీ, రికార్డ్‌ప్లేయర్, రెండు ఎయిర్ కూలర్స్ ఫేన్లు వగైరా వున్నాయి. రోజూ అందరి బట్టలూ వాషింగ్ మిషన్‌లో వేసి వాష్ చేసి ఐరన్ చేసి పెడుతుంది ఆమె.

కరెంటు ఛార్జీలు పెరగడం వల్ల బిల్ మూడు వేల రూపాయలకు పెరిగింది. వినీలకు ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు.

వినీల భర్త లోకేశ్వర్ ఎల్.ఐ.సీలో మేనేజర్. వారికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు విజయ్ బి.యస్.సి ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. రెండోవాడు సుధీర్. కంప్యూటర్స్ డిప్లమా చేస్తున్నాడు. ఇద్దరాడపిల్లల్లో పెద్దమ్మాయి కాదంబరి. రెండో అమ్మాయి విమల. పెద్దమ్మాయి టెన్త్, రెండో అమ్మాయి సెవెన్త్ చదువుతున్నారు.

ఉదయం తొమ్మిది గంటలకు యిద్దరమ్మాయిలు, సుధీర్ భోజనం చేసి టిఫిన్ బాక్సులు తీసుకొని వెళ్ళిపోతారు. వాళ్ళ స్కూల్స్ దగ్గరే, నడిచి వెళ్తారు. పదిగంటలకు లోకేశ్వర్, విజయ్ భోజనం చేస్తారు. విజయ్ కాలేజీకి బస్సులో వెళ్తాడు. లోకేశ్వర్ ఆఫీసుకి స్కూటర్‌మీద వెళ్లి వస్తాడు. వారి రూట్స్ వేరు.

నలుగురు పిల్లలూ చురుకైన వాళ్ళు, బుద్ధిమంతులు. చదువుల్లో ఫస్ట్. లోకేశ్వర్‌కి కూతుర్లపై అభిమానం జాస్తి. వారిని ఇంటి పని ఏది చెయ్యనివ్వడు.

"ఆడపిల్లలు వంటపని. ఇంటిపనీ చెయ్యకపోతే ఎలా! రేపువారు అత్తవారింటికి వెళ్లాక ఏపనీ చేతకాదని. మీ అమ్మ మిమ్మల్ని ఇలాగే పెంచిందా! అని నన్నాడిపోసుకుంటారు" అని భర్తతో వినీల పలుమార్లు వాదించింది.

"చేపపిల్లకి యీదడం. పక్షిపిల్లకి ఎగరడం. ఆడపిల్లకి వంటపని. ఇంటిపని రావడం అబ్బురమేంకాదు. వాటంతటవే వస్తాయి. రేపు పెళ్ళయ్యాక వారికి యీ పన్లు ఎలాగూ తప్పవు! అంతవరకూ వారిని హాయిగా వుండనివ్వు!" అంటూ భార్యను సమాధానపరుస్తుంటాడు లోకేశ్వర్.

అయితే వద్దన్నా వినకుండా సుధీర్ తల్లికి అన్ని పనులూ సాయం చేస్తుంటాడు.

రాత్రి డిన్నర్ అంతా ఒకే మారు చేస్తారు. కరెంటు ఛార్జీల పెంపు వల్ల పెరిగిన ఇంటి బడ్జెట్ సుమారుగా మూడువేల రూపాయలు అని లెక్కకట్టి తేల్చుకుంది వినీల.

డిన్నర్ టేబిల్ వద్ద ఖర్చుల వివరాలన్నీ భర్త, పిల్లలతో కేజువల్‌గా చెప్పింది.

"కరెంటు ఛార్జీల పెంపు మమ్మీకి పెద్ద షాకే!" అన్నారు పిల్లలు.

"మమ్మీ షాక్ ఎబ్జార్బర్ కదా! అందువల్ల అన్ని షాక్‌లూ మీ మమ్మీకే మరి!" అన్నాడు లోకేశ్వర్ నవ్వుతూ.

"అవునోయ్! మరి షాక్ ట్రీట్‌మెంట్" అన్నాడు భార్య నుద్దేశించి.

"రేపు తీసుకుంటాను!" అంది వినీల నవ్వుతూ.

మర్నాడుదయం బాత్‌రూమ్‌లోకి వెళ్లి విమల కెవ్వుమని కేకవేసింది.

"ఏం ప్రమాదం జరిగిందో" నని అంతా బాత్‌రూమ్ వద్దకు వెళ్లేరు.

"ఏమయిందమ్మా!" అన్నాడు లోకేశ్వర్ ఆతృతతో.

"నీళ్లు చల్లగా వున్నాయి డాడీ! ఎలా పోసుకోను?" అంది విమల బాత్‌రూమ్‌లోంచి.

లోకేశ్వర్ భార్య వేపు చూసేడు.

"అవునండీ! గీజర్ పాడైంది. ఎలక్ట్రీషియన్ యివాళ వచ్చి చూస్తానన్నాడు"

అని భర్తతో చెప్పి 'ఇవాల్టికి చల్లనీళ్లు పోసుకుని త్వరగా బయటకు రా!" అంది వినీల.

"పోనీ గ్యాస్ స్టౌ మీద కాసిన్ని నీళ్లు పడేయాల్సింది!" అన్నాడు లోకేశ్వర్.

"స్టౌ కాళీగా లేదండీ! ఎనిమిది గంటలుదాటింది వంట యింకా సగమైనా అవలేదు. యింకా టిఫెన్ చెయ్యాలి" అంది.

"మమ్మీ, మేం కూడా చల్లనీళ్లే పోసుకోవాలా?" అన్నారు మిగిలిన ముగ్గురు పిల్లలూ.

"అంతేకదా! లేకుంటే స్టోర్‌రూమ్‌లో బోయిలర్ వుంది. బయటకు తీసి వెలిగించుకోండి వేడినీళ్లు కావాల్సిన వాళ్లు" అంది వినీల సౌమ్యంగా.

ఆరోజు సాయంత్రం లోకేశ్వర్, పిల్లలూ ఇంటికి వచ్చి చూసేసరికి వారి యిల్లంతా ఎంతో విశాలంగానూ, కొత్తగానూ కనబడింది. టీవీ, రికార్డ్‌ప్లేయర్, ఎయిర్‌కూలర్స్, వాషింగ్ మిషిన్, గ్రైండర్ వగైరా లేవీ వాటి ప్లేసెస్‌లో లేవు.

స్టోర్‌రూమ్‌లో మూలపడవేసిన బోయిలర్ రుబ్బురోలు, అమాందస్తా లాంటి పరికరాలు బయటకొచ్చేయి.

"మీ మమ్మీ షాక్ ట్రీట్‌మెంట్‌కి బిగ్‌డోస్ తీసుకుందే!" అన్న తండ్రి మాటలకు అంతా ఏడవలేక నవ్వేరు.

**('ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక', ఏప్రిల్ 2001)** ✪